# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

●ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి: కల్తీ సత్యనారాయణ



**టేకులపల్లి, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 9**
టేకులపల్లి మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జాతీయ కో-కన్వీనర్ కల్తీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1982 ఆగస్టు 9న జెనీవాలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఆదివాసీల తొలి కార్యవర్గ సమావేశం జరిగిందని తెలిపారు. దీనికి గుర్తుగా 1994లో 147 దేశాల ఆమోదంతో ఆగస్టు 9ను ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించారని పేర్కొన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడంతో పాటు వారి అస్తిత్వాన్ని కాపాడాలని, భవిష్యత్ తరాలకు ఆదివాసీ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆసుపత్రులు అందుబాటులో లేని రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో తల్లి, బిడ్డల ప్రాణాలను కాపాడిన ఆదివాసీ మంత్రసానుల సేవలను గుర్తించాలని కోరారు. ఆదివాసీ సంప్రదాయ వైద్యులు తమ అనుభవం, జ్ఞానంతో మూలికా వైద్యం ద్వారా ఎంతో మందికి ఆరోగ్యాన్ని అందించారని తెలిపారు. గ్రామాల్లో ఇప్పటికీ సేవలందిస్తున్న సంప్రదాయ వైద్యులు, మంత్రసానులను గుర్తించి ఘనంగా సన్మానించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కల్తీ వెంకటేశ్వర్లు, తుడుం దెబ్బ మండల కార్యదర్శి ఈసం శివ, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు దుర్గారపు వీరభద్రం, జోగ యాదగిరి దొర, గొగ్గల బుచ్చయ్య పటేల్, జోగ శ్రీను, గొగ్గల చిన్న రాములు, దుర్గారావు నాగయ్య, మహిళలు ఆలెం భూలక్ష్మి, జోగా భవాని, కల్తీ భద్రమ్మ, దుర్గారపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ హక్కుల రక్షణకు గ్రామసభలే కీలకం

●1/70, 5వ షెడ్యూల్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

●ములకలపల్లిలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం






**ములకలపల్లి, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 9**
ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం, 5వ షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయించుకోవడంలో ఆదివాసీ సర్పంచులు, గ్రామసభలు కీలక పాత్ర పోషించాలని ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీల భూములు, హక్కులు, అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని కోరారు. ములకలపల్లి మండల కేంద్రంలో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లో జెండా ఆవిష్కరణ అనంతరం జగన్నాధపురం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ డప్పులు, సంప్రదాయ నృత్యాలు, కళారూపాలతో మండల కేంద్రం సందడిగా మారింది. సుమారు 1,500 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివాసీ మహిళలు, యువత సంప్రదాయ వేషధారణతో చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం సర్పంచులందరూ కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ అధికార ప్రతినిధి సోయం కన్నరాజు, తెలంగాణ ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది ఊకె రవి, గరికే శ్రీనివాసరావు మాట్లాడుతూ ములకలపల్లి ఏజెన్సీలో ఆదివాసీల జనాభా క్రమంగా తగ్గుతూ, గిరిజనేతరుల వలసలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీలకు తెలియకుండా, వారి సంతకాలు లేకుండా గ్రామసభల్లో తీర్మానాలు చేయడం, సర్పంచులపై ఒత్తిడి తెచ్చి భూములు, రోడ్లకు అనుమతులు పొందే ప్రయత్నాలను అడ్డుకోవాలని అన్నారు. 1/70 చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలను ఎదుర్కోవాలని, ఏజెన్సీ చట్టాల పరిరక్షణ కోసం న్యాయపోరాటాన్ని కొనసాగించాలని తెలిపారు. కొమరం భీమ్ వంటి పోరాట యోధుల స్ఫూర్తితో ఆదివాసీలు హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆదివాసీ హక్కుల కోసం పోరాడుతున్న పలువురు ఉద్యమకారులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కొరస చంద్రకళ, మడకం రవి, సొడే కళ్యాణ్, కొర్స ఆదిలక్ష్మి, తానం పద్మ, కారం చంద్రకళ, కుంజా వినోద్, వాడే రాములు, ఆదివాసీ సీనియర్ నాయకులు కొండ్రు సుందర్‌రావు, కారం సుధీర్, మడకం చిరుమప్ప, పాయం నరసింహారావు, మడివి రాంబాబు, మడకం శ్రీను, కీసరి శ్రీనివాస్, సోడే శ్రీను, తాటి రవి, తాటి ప్రవీణ్, వాడే నరసింహారావు, బైట రాజేష్, బైటి రాము, గడ్డం ఉదయ్, ఊరబేద్ది వెంకన్న, వాడే నాగరాజు, కుంజా రాంబాబు, సున్నం సుధాకర్, ముత్యాలరావు, రాజారావు, ఎడమ రమేష్, మడకం సురేష్, ఇరపా రవి, కోడిమె వంశీ, వెల్కమ్ వెంకటేష్, మాట్లా నాగమణి, దుబ్బ భాస్కర్, సోడె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జల్--జంగల్--జమీన్ కోసం రణభేరి మోగించిన ఆదివాసీలు

●కొమురం భీమ్, బీర్సా ముండా స్ఫూర్తితో మంగపేటలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం









**మంగపేట, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 09**
ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంగపేట మండలం ఆదివాసీ నినాదాలతో మార్మోగింది. మండలంలోని 25 గ్రామాల నుంచి వేలాది మంది ఆదివాసీలు డోలు చప్పుళ్లు, గ్రీన్ జెండాలతో భారీ ర్యాలీలుగా తరలివచ్చారు. తిమ్మంపేటలో కల్తీ మధు, గంపోనిగూడెంలో పూనెం ప్రశాంత్, బోరునర్సాపురంలో జోగ రాంచందర్ రావు, మంగపేటలో తల్లాడి నాగేశ్వరరావు జెండాలను ఆవిష్కరించి ర్యాలీలను ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి ప్రారంభమైన ర్యాలీలు కొమురం భీమ్ విగ్రహం వరకు కొనసాగాయి. అనంతరం అమరవీరుడు కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గొప్ప సమ్మారావు, కొండా చెంచయ్య, గొప్ప వీరయ్య, జబ్బు రవి మాట్లాడుతూ కొమురం భీమ్, బీర్సా ముండా పోరాట స్ఫూర్తితో ఆదివాసీలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జల్--జంగల్--జమీన్ తమ హక్కు అని, ఆదివాసీల భూములు, అడవులు, జలవనరులను కాపాడేందుకు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. 1/70, 5వ షెడ్యూల్, పీసా, అటవీ హక్కుల చట్టం వంటి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలను నిర్వాసితులను చేసే ప్రయత్నాలను తిప్పికొడతామని, చట్టాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ పిల్లలను ప్రతి ఒక్కరూ చదివించాలని, విద్యే హక్కుల సాధనకు ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. "చదువే మన ఆయుధం" అనే నినాదంతో భవిష్యత్ తరాలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొప్ప సమ్మారావు, కొండా చెంచయ్య, గొప్ప వీరయ్య, జబ్బు రవి, మద్దెల అంజయ్య, తాటి నాగరాజు, అయ్యోరి యానయ్య, తోలెం నరసింహారావు, పూనెం ప్రశాంత్, కోడం శ్రీను, చాద మల్లయ్య, కుర్సం రమేష్, పోదెం రవీందర్, పోదెం నాగేష్, కబ్బాక లక్ష్మణ్, బాడిష ఆదినారాయణ, ఆక తిరుమలరావు, మడి శోభన్, నల్లెబోయిన లక్ష్మణరావు, సోయం ఈశ్వర్ తదితర ఆదివాసీ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "జల్--జంగల్--జమీన్ హమారా హై.. కొమురం భీమ్ అమర్ హై" అంటూ చేసిన నినాదాలతో మంగపేట మండల కేంద్రం మార్మోగింది.

# బోనం ఎత్తిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

## మాణిక్యారంలో బోనాల వేడుకల్లో పాల్గొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్ బ్యూరో, ఆగస్టు 09**
ఇల్లందు మండలం మాణిక్యారం గ్రామంలో ఆషాఢమాసం సందర్భంగా నిర్వహించిన బోనాల వేడుకల్లో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామ ఆడబిడ్డలతో కలిసి ఎమ్మెల్యే కోరం కనకయ్య బోనం ఎత్తి గ్రామదేవతలకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మండల రాంమహేష్, ఇల్లందు పట్టణ అధ్యక్షులు బోళ్ల సూర్యం, స్థానిక నాయకులు ఉపేందర్, చెన్నూరి శ్రీను, కృష్ణ, పడిగ సంపత్, వెంకటపతి, నాయకులు కాకటి భార్గవ్, మడుగు సాంబమూర్తి, సొసైటీ డైరెక్టర్ కునుసోత్ రాము, చిల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పర్ణశాలను సందర్శించిన కాకినాడ భక్తులు

## భద్రాచలం--పర్ణశాల రహదారి అధ్వానంగా ఉందని ఆవేదన గుంతల రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు



**దుమ్ముగూడెం, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 9**
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్న కాకినాడకు చెందిన భక్తులు అనంతరం పర్ణశాలను సందర్శించారు. అయితే భద్రాచలం నుంచి పర్ణశాలకు వెళ్లే రహదారి గుంతలమయంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.దకాకినాడకు చెందిన సుమారు 20 నుంచి 30 మంది భక్తులు పర్ణశాలకు వచ్చినట్లు తెలిపారు. రహదారి అధ్వానంగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు, కార్లలో ప్రయాణించేటప్పుడు ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాకినాడకు చెందిన పెదబాబు మాట్లాడుతూ, తెలంగాణలోని రహదారులు భక్తులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఉన్నాయని అన్నారు. సుబ్బన్న మాట్లాడుతూ, రహదారి పరిస్థితి తెలియకుండా వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. భద్రాచలం--పర్ణశాల రహదారిని వెంటనే మరమ్మతులు చేసి భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించాలని వారు కోరారు. రహదారి పరిస్థితి దృష్ట్యా ప్రయాణికులు నెమ్మదిగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ సందర్భంగా పెదబాబు, సుబ్బన్న, బ్రహ్మం కాపు, సుబ్బారావు, రాజేష్ తదితరులు మాట్లాడారు.

# ఇల్లందు మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలికంగా వాయిదా

## పీఆర్సీ బకాయిల చెల్లింపు, ఈపీఎఫ్‌ను విడతలవారీగా చెల్లించేందుకు హామీ



**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్ బ్యూరో, ఆగస్టు 09**
ఇల్లందు మున్సిపల్ కార్మికులు సోమవారం చేపట్టాల్సిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్, టీయూసీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో కార్మికుల డిమాండ్లపై చర్చలు జరిగాయి.ఈ చర్చల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, కమిషనర్ సందీప్, మేనేజర్ శ్రీనివాస్, దొడ్డ డానియల్, యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి, ఇల్లందు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కార్మికులకు 12 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిల్లో ఐదు నెలల బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. 42 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్ బకాయిలను విడతలవారీగా చెల్లిస్తామని తెలిపారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఒక నెలలోపు ఉపాధి కల్పించేలా చైర్‌పర్సన్, ఎమ్మెల్యే సహకారంతో ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే ప్రతి నెలా కార్మికులకు జీతాల స్లిప్పులు అందజేస్తామని, ఈ మేరకు రాతపూర్వక ఒప్పందం జరిగినట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి తెలిపారు. ఒప్పందాన్ని అమలు చేయని పక్షంలో తిరిగి సమ్మె తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.ఈ చర్చల్లో శానిటేషన్, వాటర్ సప్లై యూనియన్ అధ్యక్షులు నాయిని కృష్ణదుర్గ, మహేష్, సంజీవ్, రాకం రవి తదితరులు పాల్గొన్నారు.

# అఖిలపక్షం ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

## 1/70, పీసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి : ఆదివాసీ నాయకులు



**గుండాల, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 09**
గుండాల మండల కేంద్రంలో అఖిలపక్షాలు, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వజ్జ ఎర్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుండాల సర్పంచ్ కోరం సీతారాములు మాట్లాడుతూ 1/70, పీసా వంటి ఆదివాసీ చట్టాలు ఉన్నప్పటికీ వాటి పూర్తి స్థాయి అమలులో ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. చట్టాల అమలు కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పూనెం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల పరిరక్షణకు అందరూ కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగగూడెం సర్పంచ్ చింత వెంకటేశ్వర్లు, ముత్తాపురం సర్పంచ్ కల్తీ రాధా, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు వాగబోయిన చంద్రయ్య దొర, మండల అధ్యక్షులు పూనెం రమణబాబు, పెండకట్ల మహేందర్, నాగరాజు, తుడుం దెబ్బ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవింద నరసింహారావు, మోకాళ్ల మహేందర్, జిల్లా నాయకులు ఈసం సాంబయ్య, కల్తీ వసంతరావు, ఊకె రవికుమార్, ఆదివాసీ ట్రైబల్ ఫోరం నాయకులు ఈసం కృష్ణ, సీపీఎం మండల నాయకులు ఊకె వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షులు సోలం సతీష్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మోకాళ్ల వీరస్వామి, టీజేఎస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి రమేష్, ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు పెండకట్ల సత్యం, జోగ పోతయ్య, అరెం నరేష్, గడ్డం లాలయ్య, యాసారపు వెంకన్న, ఈసం కృష్ణ, కల్తీ లక్ష్మణ్, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ హక్కుల పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం




**మణుగూరు, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 09**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం విద్యార్థులు ముందుండి ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సత్రపల్లి సాంబశివరావు పిలుపునిచ్చారు.

ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రత్యేక చట్టాలు, అటవీ భూములపై హక్కులు, జల్--జంగల్--జమీన్ పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

ఆదివాసీ హక్కులకు ఎక్కడైనా భంగం కలిగితే విద్యార్థులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నించి, ఆదివాసీ ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, భాషలను పరిరక్షించడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు జక్కంపూడి చరణ్, మండల కార్యదర్శి బొల్లి తేజహర్ష అధ్యక్షత వహించారు. భవిష్యత్తులో ఆదివాసీ హక్కులపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కోడి అశోక్, మనోజ్, వెంకటేష్, అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ జ్వాల ఎప్పటికీ ఆరిపోదు

- సుదర్శన్ రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు



**మంగపేట, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 09**

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తితో ప్రజల కోసం పనిచేసిన సుదర్శన్ రెడ్డి సేవలను వారు స్మరించుకున్నారు. సుదర్శన్ రెడ్డి భౌతికకాయానికి నివాళు లర్పించేందుకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లబెల్లికి రానున్న నేపథ్యంలో ములుగు జిల్లా నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు జిల్లా నాయకులు తాటి కృష్ణ, ఎడ్లపల్లి నరసింహారావు, చిట్టిమల్ల సమ్మయ్య నేతృత్వంలో మంగపేట మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నల్లబెల్లికి బయలుదేరారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి తెలంగాణ ఉద్యమానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన స్ఫూర్తి ప్రతి తెలంగాణ బిడ్డ గుండెల్లో సజీవంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పప్పు వెంకట్ రెడ్డి, గాదె శ్రీనివాసచారి, ఎస్కే కుర్బాన్ అలీ, సయ్యద్ హుస్సేన్, యాదమ్మ రాజయ్య, ఎండీ అయూబ్ ఖాన్, పూజారి శ్రీనివాస్, చిన్నపెల్లి వెంకన్న, తుక్కాని శ్రీనివాస్, గుడిసేవ నాగేశ్వరరావు, డాక్టర్ సమ్మయ్య, మూగల రమేష్, మూగల రాము, జాడి కృష్ణతో పాటు మండల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మాజీ గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# కొమురం భీమ్ ఆశయాలతో ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం: మంత్రి సీతక్క

- అశ్వారావుపేటలో కొమురం భీమ్ విగ్రహావిష్కరణ
- భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పిలుపు





**అశ్వారావుపేట, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 09**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అశ్వారావుపేటలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో కొమురం భీమ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి మంత్రి దానసరి అనసూయ (సీతక్క), ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు హాజరయ్యారు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కొమ్ము నృత్యాలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. కొమురం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆయన స్ఫూర్తితో జల్, జంగల్, జమీన్ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, గృహాలు, మౌలిక సదుపాయాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. యువత ప్రభుత్వం అందిస్తున్న విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానమే వారి అస్థిత్వమని, వాటిని భావితరాలకు అందించాలని మంత్రి కోరారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఆదివాసీ సమాజంలో విద్య, ఐక్యత, చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కొమురం భీమ్ పేరుతో ఏర్పాటు చేయనున్న అర్బన్ పార్కులో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఆదివాసీ వీరుల పోరాట చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు వారి భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ జేఏసీ నాయకులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ స్ఫూర్తితో ప్రతి మహిళ ఉక్కు మహిళగా ఎదగాలి: మంత్రి సీతక్క

## మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు





**అశ్వారావుపేట, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 09**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంత్రి దానసరి అనసూయ (సీతక్క), ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్ అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అశ్వారావుపేటలో గిరిజన విద్యా వికాస కేంద్రంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న కాంపౌండ్‌వాల్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

దమ్మపేట మండలం చీపురుగూడెంలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. నాచారం నుంచి సీతారాంపురం వరకు రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నాగుపల్లి, కొత్తూరు గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించి, గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి మహిళ ఉక్కు మహిళగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, వాటిని ఆదాయం వచ్చే వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టాలని సూచించారు. స్థానిక వనరులను వినియోగించుకుని పుట్టగొడుగులు, కోళ్ల పెంపకం, ఆహార ఉత్పత్తులు వంటి ఉపాధి కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు.

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ మహిళా సంఘాలకు సొంత భవనాలు, రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించేందుకు సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, ఇతర ఉపాధి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# డీజిల్ కోసం వచ్చి రూ.5,200 బదులు రూ.50,200 చెల్లింపు

## పొరపాటున అధిక మొత్తంలో ఫోన్‌పే చేసిన వ్యక్తి కోసం పెట్రోల్ బంక్ యాజమాన్యం ఆరా

**దుమ్ముగూడెం, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 9**

చిన్న నల్లబెల్లి పెట్రోల్ బంక్‌లో డీజిల్ కోసం వచ్చిన ఓ వ్యక్తి రూ.5,200కు బదులుగా పొరపాటున రూ.50,200 ఫోన్‌పే చేసిన ఘటన చోటుచేసుకుంది. పెట్రోల్ బంక్ యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. మడివి రమేష్ అనే వ్యక్తి డీజిల్ కోసం బంక్‌కు వచ్చి రూ.5,200 చెల్లించాల్సి ఉండగా, పొరపాటున రూ.50,200 ఫోన్‌పే చేసినట్లు తెలిపారు. డీజిల్ పోసుకున్న అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఫోన్‌పే లావాదేవీలను పరిశీలించిన బంక్ యాజమాన్యం రూ.5,200కు బదులుగా రూ.50,200 చెల్లించినట్లు గుర్తించింది. లావాదేవీ వివరాల ఆధారంగా చెల్లింపు చేసిన వ్యక్తి మడివి రమేష్‌గా గుర్తించినట్లు తెలిపారు. మడివి రమేష్ గురించి తెలిసిన వారు చిన్న నల్లబెల్లి పెట్రోల్ బంక్ యాజమాన్యానికి సమాచారం అందించాలని కోరారు.

# ప్రభుత్వాలు ఎన్నో మారినా.. మారని ఆదివాసీ జీవితాలు

## నేటికీ విద్య, వైద్యం, రవాణాకు దూరంగా ఆదివాసీ గ్రామాలు : పీడీఎస్‌యూ

**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్ బ్యూరో, ఆగస్టు 09**



ప్రపంచ ఆదివాసీ పోరాట దినం సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఇల్లందు కొత్త బస్టాండ్ సెంటర్‌లోని అమరజీవి కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి, కొమరం భీమ్‌తో పాటు ఆదివాసీ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. సాంబ, జిల్లా ప్రధాన కార్యదర్శి జె. గణేష్ మాట్లాడుతూ ఆదివాసీలు తమ మనుగడ, స్వయంపాలన కోసం బ్రిటిష్ వ్యతిరేక పోరాటం నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఆదివాసీలు ప్రకృతిని, అడవిని నమ్ముకుని జీవిస్తున్నారని, అడవుల్లోని సహజ సంపద కోసం పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు వారిని అడవుల నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆదివాసీల హక్కులు, రక్షణ కోసం ఏర్పాటైన చట్టాలను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. నేటికీ అనేక ఆదివాసీ గ్రామాలు విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలకు దూరంగా ఉన్నాయని, గిరిజన పేదలకు మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలు కూడా వారికి నాణ్యమైన విద్య, మెరుగైన జీవన సౌకర్యాలు అందించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. ఆదివాసీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వారి హక్కులు, మనుగడ కోసం సాగిస్తున్న ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్, శ్రీను, రాము, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్

## దశదినకర్మకు హాజరై కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించిన బీఆర్ఎస్ నాయకులు



**ఇల్లందు, మన భద్రాద్రి న్యూస్ బ్యూరో, ఆగస్టు 09**

అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్నను పరామర్శించి, ఓదార్చి మనోధైర్యం కల్పించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగుదారులపై దాడులను ప్రతిఘటించాలి

## సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా

**గుండాల, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 09**



సాగుదారులపై అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖల దాడులు, దౌర్జన్యాలను ప్రతిఘటించాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా గుండాల మండలంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర నాలుగో రోజు ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ.. గిరిజన, గిరిజనేతర పోడు సాగుదారులకు వారు సాగు చేస్తున్న భూములపై తక్షణమే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఆధారమైన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని అన్నారు. మారుమూల గ్రామాలకు రహదారులు, ఇతర కనీస మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను సమిష్టిగా అడ్డుకోవాలని, గుండాల ప్రాంతంలో నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని, సెప్టెంబర్ 1న చేపట్టే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా కొమురం భీమ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, సారెడ్డి పుల్లారెడ్డి, రేసు ఎల్లయ్య, మున్నా లక్ష్మీకుమారి, ఉప్పుశెట్టి రాహుల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చర్లలో అంబరాన్నంటిన ప్రపంచ ఆదివాసి దినోత్సవ సంబరాలు

- డోలు వాయిద్యాలతో మారుమోగిన మండల కేంద్రం
- గిరిజన సంప్రదాయాలు ఉట్టిపడేలా సంస్కృతిక వేషధారణలు
- వేలాదిగా చర్ల మండల కేంద్రానికి తరలివచ్చిన ఆదివాసి గిరిజనులు
- వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పొదెం వీరయ్య
- అంబేద్కర్ సెంటర్లో ఆదివాసి జెండాను ఎగురవేసిన సిఐ రాజు వర్మ





**చర్ల, మన భద్రాద్రి న్యూస్, ఆగస్టు 09**

ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రం గిరిజన సంస్కృతితో కళకళలాడింది. డోలు వాయిద్యాల మోతలు, నృత్యాలు రంగురంగుల సాంప్రదాయ వేషధారణలతో మండల కేంద్రం అంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. ఆదివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి సంఘ నాయకుల ఆధ్వర్యంలో వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాదిగా చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులు ఈ ఉత్సవాల్లో భాగమయ్యారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ తమ సాంప్రదాయ దుస్తులు ధరించి చేతుల్లో విల్లంబులు తలలపై ఈకల టోపీలతో ఊరేగింపులో పాల్గొన్నారు. నాయక పోడు తెగల సంప్రదాయాలు ఉట్టిపడేలా నృత్యాలు పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం బస్టాండ్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణను తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి అంటే ఈ దేశానికి మూలవాసని, అడవిని కాపాడే కాపలా దారుడని, వారి జ్ఞానం, సంస్కృతి, జీవన విధానం లేకుండా ప్రకృతి సమతుల్యత సాధ్యం కాదని అన్నారు. ఆదివాసీల భూమి హక్కులు, భాష, సంస్కృతి గుర్తింపును కాపాడుకోవడమే ఈ దినోత్సవ లక్షమని, ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని, విద్యా,వైద్యం ఉపాధి అవకాశాల్లో మరిన్ని చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని వీరయ్య హామీ ఇచ్చారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో ఆదివాసి జేఏసీ సంఘాలు ఏర్పాటు చేసిన ఆదివాసి జెండాను సిఐ రాజు వర్మ ఎగురవేశారు. ఉత్సవాల్లో భాగంగా గిరిజన సాంప్రదాయ నృత్యాలకు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జల్, జంగల్, జమీన్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. డోలు చొప్పులు గిరిజన నినాదాలతో చర్ల వీధులన్నీ జాతరను తలపించాయి. ఈ వేడుకలు ఆదివాసి ఐక్యతకు ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచాయి. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్ల సీఐ రాజు వర్మ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ర్యాలీ మార్గమంతా బందోబస్తు



నిర్వహించారు. ప్రజలు ప్రశాంతంగా సంబరాలు జరుపుకునేలా పోలీసులను మోహరించి ట్రాఫిక్ నియంత్రించడంతో ప్రజలు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంబరాల్లో పాల్గొన్నారు. డోలు చప్పుళ్ళు, జై ఆదివాసి నినాదాలతో చర్ల వీధులన్నీ గిరిజన ఆత్మగౌరవంతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో మండలంలోని నలుమూలలలో ఉన్న ఆదివాసి గ్రామాల నుండి వేలాది మంది గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆదివాసీలకు ప్రత్యేక స్థానం

## గిరిజన సంక్షేమానికి ప్రత్యేక చర్యలు: ఐటీడీఏ పీవో బి.రాహుల్







**భద్రాచలం, ఆగస్టు 09: మన భద్రాద్రి న్యూస్**

భద్రాచలంలోని ఆదివాసీ గిరిజన భవనంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నారని అన్నారు. అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ వంటి ఆదివాసీ వీరుల పోరాట స్ఫూర్తితో హక్కులను పరిరక్షించుకోవాలని సూచించారు. గిరిజనుల విద్య, వైద్యం, తాగునీరు, గృహాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల అభివృద్ధికి ఉద్దీపకం వర్క్‌బుక్, కెరీర్ గైడెన్స్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్ఐటీ, ఐఐటీ సీట్లు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, పై చదువులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అంతకుముందు అంబేద్కర్ కూడలి వద్ద ఆదివాసీ అమరవీరుల స్థూపాలకు నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీలో పాల్గొని ఐటీడీఏ సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

- ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐక్యంగా ముందుకు సాగాలి : ఎమ్మెల్యే పాయం





**మణుగూరు, ఆగస్టు 09: మన భద్రాద్రి న్యూస్**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మణుగూరు మండలంలో నిర్వహించిన వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. హనుమాన్ టెంపుల్, అంబేద్కర్ సెంటర్ వద్ద కొమురం భీమ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం, 'జల్, జంగల్, జమీన్' నినాదం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ యువత విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అనంతరం నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆదివాసీ ఐక్యత, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణ సందేశాన్ని ర్యాలీ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా భద్రాద్రిలో గోదావరి మాతకు నదీహారతి

## భక్తులకు గోదావరి మాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి పురోహితుల సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్





**భద్రాచలం, ఆగస్టు 09: మన భద్రాద్రి న్యూస్**

భద్రాచలం పుణ్యక్షేత్రంలోని గోదావరి స్నాన ఘట్టాల వద్ద ఆదివారం సాయంత్రం గోదావరి మాతకు నదీహారతి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితుల సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్ మాట్లాడుతూ ఆషాఢ బహుళ ఏకాదశి సందర్భంగా భద్రాద్రిలో నిర్వహించే గోదావరి హారతి విశిష్టమైనదన్నారు. గోదావరి మాత, శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పురోహితులు గోదావరి హారతి విశిష్టతను భక్తులకు వివరించి గణపతి పూజ, దీపోత్సవం నిర్వహించారు. అనంతరం గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేసి లోకకళ్యాణం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం శాంతి మంత్ర పఠనం నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పూజా సామగ్రిని రెడీమేడ్ బట్టల షాప్ అసోసియేషన్, భద్రాచలం వారు అందించారు. ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్ శర్మ, సత్య ప్రసాద్ శర్మ, పవన్ కుమార్ శర్మ, రామాచార్యులు, జొన్నవిత్తుల చంద్రశేఖర్, తిరుపతిరావు, ఎన్ఎస్ఎన్ రెడ్డి, నరసింహ శర్మ, తేజ శర్మ తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఉపసర్పంచ్‌ల సంఘం నాయకులు

- ఉపసర్పంచ్‌ల హక్కులు, గ్రామ పంచాయతీల బలోపేతానికి కృషి చేయాలి
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, ఆగస్టు 09 మన భద్రాద్రి న్యూస్**

తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన గాండ్ల సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన అచ్చా నవీన్ మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, గ్రామ పంచాయతీల బలోపేతం, ఉపసర్పంచ్‌ల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి గాండ్ల సురేష్, జిల్లా అధ్యక్షుడు అచ్చా నవీన్ మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఉపసర్పంచ్‌ల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.
అనంతరం నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, ఆత్మ కమిటీ సభ్యులు ఆవుల సర్వేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోనాల పండుగ సందర్భంగా ఆగస్టు 10న ప్రజావాణి రద్దు

## ప్రజలు ఆగస్టు 10న ఐడీఓసీ కార్యాలయానికి రావద్దు: జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 09: మన భద్రాద్రి న్యూస్**




బోనాల పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున ఆగస్టు 10న సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. దప్రభుత్వ సెలవు కారణంగా జిల్లా అధికారులు అందుబాటులో ఉండరని, అందువల్ల ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించేందుకు ఆగస్టు 10న ఐడీఓసీ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ సూచించారు.